## రుణమాఫీ చేయాలి..బోనస్ ఇవ్వాలి



కోటగిరిలో మాట్లాడుతున్న విండో చైర్మన్

కోటగిరి/నవీపేట, మార్చి 20: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణ మాఫీని ఒకే దఫాలో చేయాలని, వరికి రూ.500 బోనస్ ఇవ్వాలని కోటగిరి, నవీపేట సహకార సంఘ సభ్యులు, డైరెక్టర్లు తీర్మానం చేశారు. సొసైటీ చైర్మన్లు కూచి సిద్ధూ, న్యాలకంటి అబ్బన్న అధ్యక్షతన బుధవారం విండో మహాజన సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, చేపట్టిన అభివృద్ధి పనులను చైర్మన్లు వివరించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు బొట్టే గజేందర్, ప్రవీణ్‌కుమార్ డైరెక్టర్లు కోయిగూర్ శ్రీనివాస్, ఆనంద్ దేశ్‌పాండే, గాండ్ల వీరేశం,కాంతంరెడ్డి, శ్రీనివాస్, గణేశ్, రాము, గోపి పాల్గొన్నారు.

## త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

### కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, మార్చి 20: యాసంగి ధాన్యం సేకరణకు త్వరలోనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 462 సెంటర్లను ఏర్పాటు చేయనుండగా, అందులో సొసైటీల ఆధ్వర్యంలో 417, ఐకేపీ 39, మెప్మా ద్వారా 6 కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయన్నారు. జిల్లాలో వరిసాగు సాధారణ విస్తీర్ణం లక్షా13వేల967 హెక్టార్లు కాగా ఈసారి సాధారణానికి మించి లక్షా66వేల761 హెక్టార్లలో రైతులు వరిసాగు చేశారని కలెక్టర్ వివరించారు. 11.72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచన ఉండగా అందులో 7.57 లక్షల మెట్రిక్ టన్నుల వరకు గంగాకావేరి, ఇతర సన్న రకాలు ఉన్నాయని, సుమారు 4.15లక్షల మెట్రిక్ టన్నుల మేర దొడ్డురకం ధాన్యం నిల్వలు చేతికి అందుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే కొందరు వ్యాపారులు రైతులను నేరుగా కలిసి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, రైతులు కూడా కొంతమొత్తం పంటను నిల్వ చేసుకుంటారని తెలిపారు. దీంతో ఈసారి జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా 6లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామని కలెక్టర్ వెల్లడించారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ.2203, సాధారణ రకానికి రూ.2183 ధర చెల్లిస్తామని తెలిపారు. త్వరలో అందుబాటులోనికి వచ్చే కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వేసవి విడిదికి.. చుట్టాలొచ్చారు..







**గోదావరి తీరం** విదేశీ పక్షులతో కనువిందు చేస్తున్నది. నిజామాబాద్ జిల్లా నందిపేట, డొంకేశ్వర్ మండలాల పరిధిలోని శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ప్రాంతంలో ఆఫ్రికన్ ఫ్లెమింగోస్ సందడి చేస్తున్నాయి. ఏటా వేసవికాలంలో ఇక్కడికి విదేశీ పక్షులు వలస వస్తుంటాయి. సాగర తీరం.. పచ్చికబయళ్లు.. పక్షులతోపాటు కృష్ణజింకల సయ్యాటలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. వీటి రాకతో ప్రకృతి ప్రేమికులు తీర ప్రాంతాలను సందర్శిస్తూ వాటిని కెమెరాల్లో బంధిస్తున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

## నిజామాబాద్‌లో గులాబీజెండా ఎగురవేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, చిత్రంలో ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, ఎం.సంజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి
### సన్నాహక సమావేశంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి
### హాజరైన బీఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి, ముఖ్యనాయకులు

మోర్తాడ్, మార్చి 20: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు, వాటిపై ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకతే బీఆర్‌ఎస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలే లక్ష్యంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొని నిజామాబాద్ లోక్‌సభ స్థానంలో గులాబీజెండాను ఎగురవేయాలని అన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి నివాసంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు బుధవారం నిజామాబాద్ బీఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, నియోజకవర్గ నాయకులతో కలిసి ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో పార్టీ లైన్‌ను అనుసరించి ప్రజలకు బీఆర్‌ఎస్ ఆవశ్యకత, కేసీఆర్ చేపట్టిన ప్రజాసంక్షేమం, అభివృద్ధిపై వివరించాలని చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన వైఖరిని ఎండగడుతూ, మరోసారి వారి చేతుల్లో మోసపోకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తెలంగాణ పరిరక్షణ, ప్రజా సంక్షేమం ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమన్న విషయాన్ని పదేండ్లలో జరిగిన అభివృద్ధితో వివరించాలని చెప్పారు. తెలంగాణ ఏర్పాటులో కీలకంగా ఉన్న బీఆర్‌ఎస్, ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్ర పురోభివృద్ధికి బీఆర్‌ఎస్ అనివార్యమని విడమరిచి చెప్పాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, ఎం.సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంతా సురేశ్, నియోజకవర్గబాధ్యులు గణేశ్‌గుప్తా, వీజీగౌడ్, మాజీ మంత్రి రాజేశం గౌడ్, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ తదితరులు పాల్గొన్నారు.

## తులం బంగారం ఏమాయే..

### హామీల అమలుపై కాంగ్రెస్ ఊసెత్తడం లేదు
### మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

నిజాంసాగర్, మార్చి 20: లేనిపోని హామీలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు వాటి అమలు విషయం ఊసెత్తడం లేదని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పటికీ అందించడం లేదని విమర్శించారు. నిజాంసాగర్ మండలంలో బుధవారం ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసరా పింఛన్లను రూ.4వేలకు పెంచలేదని, మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఇవ్వలేదని, రైతులకు పూర్తిస్థాయిలో రైతుబంధు అందలేదని ఆరోపించారు. కాంగ్రెస్ చేసిన మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలందరూ ఏకతాటిపై ఉండి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దుర్గారెడ్డి, వైస్ ఎంపీపీ మనోహర్, సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులు నారాయణ, రమేశ్ గౌడ్, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రియల్ జోరు



- శరవేగంగా ఇందూరు అభివృద్ధి
- మెట్రోసిటీని తలదన్నేలా భవన నిర్మాణాలు
- విస్తరిస్తున్న స్థిరాస్తి రంగం
- రేపటి నుంచి నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో
- ఒకే వేదికపైకి రియల్ ఎస్టేట్ సంస్థలు



ఖలీల్‌వాడి, మార్చి 20: స్థిరాస్తి రంగంలో ఇందూరు నగరం దూసుకుపోతున్నది. వెంచర్లు, అపార్ట్‌మెంట్లు, విల్లాలు, అధునాతన భవంతులతో మెట్రో సిటీని తలపిస్తున్నది. ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన రవాణా వ్యవస్థతో పాటు పర్యాటక, వాణిజ్య రంగాల్లో నిజామాబాద్ అభివృద్ధి చెందుతున్నది. మెరుగైన జీవన ప్రమాణాలు ఉన్న నగరంలో నివసించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో రియల్ వ్యాపారానికి డిమాండ్ ఏర్పడింది. నగర శివారుతో పాటు నుడా పరిధిలోని గ్రామాల్లోనూ పెద్ద ఎత్తున వెంచర్లు వెలుస్తున్నాయి. ఇక్కడున్న డిమాండ్‌ను చూసి నిజామాబాద్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన పలు కార్పొరేట్ రియల్ ఎస్టేట్ సంస్థలు సైతం వెంచర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తున్నాయి.

**ఆహ్లాదకర వాతావరణం..**

నిజామాబాద్ నగరంలో ఎటు చూసినా పచ్చదనమే కనిపిస్తున్నది. సెంటర్ మీడియన్లు పచ్చని చెట్లతో స్వాగతం పలుకుతున్నాయి. మాధవనగర్ నుంచి నిజామాబాద్, దాస్‌నగర్‌నుంచి నిజామాబాద్, అర్సపల్లి నుంచి నిజామాబాద్ రోడ్లు సుందరంగా తయారయ్యాయి. రాత్రిపూట ఎల్‌ఈడీ విద్యుత్ వెలుగులతో నగరం మిరుమిట్లు గొలుపుతున్నది. నగరం చుట్టూ ఉన్న బైపాస్ రోడ్డును ఆనుకొని కలెక్టరేట్, ఐటీ టవర్‌తోపాటు పర్యాటకంగా మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణంతో భూములకు విలువ అమాంతం పెరిగింది.

**జీవన ప్రమాణాలు భేష్..**

కేంద్ర ప్రభుత్వం 2019లో దేశవ్యాప్తం గా 5లక్షలు, ఆపై జనాభా గల 111 పట్ట ణ నగరాల్లో జీవన ప్రమాణాల సూచిక సర్వే నిర్వహించింది. పాలనా వ్యవహారం, పౌరులకు అందుతున్న సేవలు, ప్రజల గుర్తింపు, జీవన విధానాలు, సంస్కృతులు, విద్యావిధానం, వైద్యం, పరిశుభ్రత, పారిశుధ్యం, భద్రత, రక్షణ, ఉద్యోగకల్పన, నివాస స్థితిగతులు, విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌పోర్ట్, వృథానీటి వినియోగం, కాలుష్య నివారణ ఇలా 79 అంశాలను పరిగణలోకి తీసుకున్నది. అదే యేడాది ఆగస్టులో సర్వే వివరాలను ప్రకటించగా నిజామాబాద్ నగరం సత్తా చాటింది.

**రేపటి నుంచే 'నమస్తే' ప్రాపర్టీ షో..**

జీవనప్రమాణాల్లో మెరుగైన స్థానం సంపాదించుకున్న ఇందూరు నగరంలో ప్లాట్, ఇల్లు, అపార్ట్‌మెంట్ ఫ్లాట్ కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్న ప్రజలకు నమస్తే తెలంగాణ–తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ప్రాపర్టీ షోను ఏర్పాటు చేస్తున్నది. ఈ నెల 22,23 తేదీల్లో నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నది. సొంతింటి కల సాకారం చేసుకునేందుకు రియల్ ఎస్టేట్ సంస్థల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపైకి ప్రముఖ సంస్థలను తీసుకొస్తున్నది. రుణ సౌకర్యం సైతం కల్పించేందుకు బ్యాంకు స్టాళ్లను కూడా ఏర్పాటు చేస్తున్నది. ప్రజలకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నది.

**ఒకే వేదికపై ప్రముఖ కంపెనీలు..**

అపర్ణ కన్‌స్ట్రక్షన్, ప్రైమ్ ఎస్టేట్స్, మోడీ ప్రాపర్టీస్, ఫేర్‌మౌంట్, శ్రీ అశోక బిల్డర్స్ అండ్ డెవలపర్స్, నార్త్ క్రెస్ట్, సంతోష్ డెవలపర్స్, రాయల్‌ఓక్, జీఆర్ బిల్డర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్స్, అమృతా ప్రాజెక్ట్స్, వాసు శ్రీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, శ్రీ వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్, అక్షయ ఎంటర్ ప్రైజెస్, భూమి స్పేస్, గోల్డెన్ కీ మయూర, వీజీ హోమ్స్, ఇండిస్, సన్‌యుగ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, వల్లేరు డెవలపర్స్ తోపాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు.

## ఎన్‌డీసీసీబీ చైర్మన్ పదవికి భాస్కర్‌రెడ్డి రాజీనామా

ఖలీల్‌వాడి, మార్చి 20: ఎన్‌డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. మరో సంవత్సరం పదవీ కాలం ఉండగానే రాజీనామా చేసి సహకార బ్యాంక్ కమిషనర్‌కు లేఖని బుధవారం అందజేశారు. ఇదిలా ఉండగా పదవుల కోసం పార్టీలు మారుతున్న ఈ సమయంలో.. పార్టీ కోసం భాస్కర్‌రెడ్డి పదవిని త్యజించారని గులాబీ శ్రేణులు అభినందిస్తున్నారు.


